క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ అలంకార్ సబ్ స్టేషన్ పరిధిలో అలంకార్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ రాజు రోడ్డు, పాపయ్య వీధి, జ్ఞానోలివ్ వారి వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, ఆంధ్ర రత్న రోడ్డు, రామారావు స్ట్రీట్, తాలూకా ఆఫీస్, నర్రా వారి స్ట్రీట్, ప్రెస్ క్లబ్, అలంకార్ సినిమా హాల్, ఐలాపురం హోటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీ విద్యా ప్రస్థాన త్రయం గ్రంథావిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన గ్రంథకర్త డాక్టర్ క్రోవి పార్థసారథి రచించిన శ్రీ విద్యాప్రస్థాన త్రయం గ్రంథాన్ని అస్సాంలోని కామాఖ్యాదేవాలయంలో ప్రధాన అర్చకులు నీలాంబర శాస్త్రి, జ్ఞానానంద శర్మల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత క్రోవి పార్థసారథి మాట్లాడుతూ.. శ్రీ విద్య గురించి లలితా సహస్రం, సౌందర్యలహరి, శ్రీవిద్యా మంత్రమైన పంచదశ మహా మంత్రం వివరించేది, వరివశ్యా రహస్యం వివరిస్తాయన్నారు. ఈ మూడింటిని కలిపి శ్రీ విద్యలో ప్రస్థాన త్రయం అంటారని వీటిని చదివితే శ్రీ విద్య పూర్తిగా అవగతమవ్వటంతో పాటు సాధకుడికి మోక్షం లభిస్తుందన్నారు. ఈ అంశం సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో శ్రీ విద్యాప్రస్థాన త్రయం పేరుతో ఈ గ్రంథాన్ని ఆవిష్కరించామని తెలిపారు.

బాలగణపతి ఆలయంలో ఒకటో తేదీ వరకు ఉత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో గణపతి మహోత్సవాలు ఈ నెల 18 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీవెంకటకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గణపతి మహోత్సవాలు పరిస్కరించుకుని ఈ నెల 18వ తేదీన రాత్రి ఏడు గంటలకు శ్రీ కుబేర గణపతి అలంకరణలో స్వామివారి భక్తులకు దర్శనమిస్తారన్నారు. శ్రీ కుబేర గణపతిని కోటి రూపాయలు విలువ గల బంగారు ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. తొమ్మిది రోజుల పాటు స్వామి వారు రోజుకొక అలంకారంలో దర్శనమిస్తారని చెప్పారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- 64వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ 282 వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని, 312 గడపలను సందర్శించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో సిఫార్సులతో ప్రమేయం లేకుండా, ఎక్కడా అవినీతికి తావు లేకుండా తమకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని మహిళలు, వృద్ధులు ఎమ్మెల్యేకు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి జాప్యం జరిగిన తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కాపుల అభ్యున్నతికి విశేష కృషి..

అనంతరం ఎమ్మెల్యే విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. నాలుగో విడత కాపు నేస్తం ద్వారా నియోజకవర్గంలో 2,583 మంది అక్కచెల్లెమ్మలకు రూ.3 కోట్ల 87 లక్షల 45 వేల లబ్ధి చేకూరిందన్నారు. నాలుగేళ్లలో రూ.12 కోట్లు అందించామన్నారు. అలాగే కోటి రూపాయలతో నిర్మించే కాపు కల్యాణ మండపానికి దివంగత నేత వంగవీటి మోహనరంగా పేరు పెట్టామని ఆయన తెలిపారు. రంగా వర్ధంతి(డిసెంబర్ 26) నాటికి కల్యాణ మండపాన్ని ప్రారంభించుకునేలా పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబు అమాయకుడంటూ నారా లోకేష్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఎన్ని కుంభకోణాలు చేసినా, తమను ఎవరూ ఏమి అనకూడదన్న విధంగా లోకేష్ వ్యవహార శైలి ఉందని విమర్శించారు. మరో వైపు రాష్ట్ర రాజకీయాలలో అత్యంత బలమైన నాయకుడిగా సీఎం జగన్ ఉన్నారని చెప్పడానికి ప్రతి పక్షాల కలయికే ఒక ఉదాహరణ అని విష్ణు అన్నారు. వెంటిలేటర్‌పై టీడీపీని బతికించేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రయత్నాలు నవ్వు తెప్పిస్తున్నాయన్నారు. కేవలం పవన్ కళ్యాణ్ తప్ప చంద్రబాబు అరెస్టును ఎవరూ పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం వేధింపులకు గురిచేసిన రోజున ఎందుకు మాట్లాడలేదని పవన్ ను సూటిగా ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన కలిసి వచ్చినా తమకు ఎటువంటి నష్టం లేదన్నారు. ఈఈ శ్రీనివాస్, డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు శ్రీరాములు, ఇస్మాయిల్, జిల్లెల శివ, పందిరి వాసు, విన్నకోట నాగు, మాతా మహేష్, కొక్కిలిగడ్డ నాని, త్రినాథ్, పరిమి నాగేశ్వరావు, వెంకటేశ్వరమ్మ, విమల, తాండవ కోటి, కిరణ్, కృప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాగణపతి.. సదాస్మరామి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న శివస్వామి, శివాజీ తదితరులు

విజయవాడ కల్చరల్: చిట్టి చేతులు అద్భుతాలు సృష్టించాయి. తమ సృజనకు పదును పెడుతూ మట్టితో చేసిన గణనాథులు ప్రాణం పోసుకున్నట్లు వివిధ అనేక ఆకృతులు కనువిందు చేశాయి. శ్రీ గణేష ఉత్సవ సమితి విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో శనివారం మట్టి వినాయకుని పోటీలు నిర్వహించారు. నగరంలోని అనేక పాఠశాలల నుంచి 600 మందికి పైగా బాలబాలికలు, కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాళ్లయపాలెం పీఠాధిపతి శివస్వామి పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ సామూహిక వినాకయ విగ్రహ పూజను ప్రారంభించారని అదే సంప్రదాయం నేటికి కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యుడు నాగలింగం శివరాజీ, వ్యాపారవేత్త తొండెపు హనుమంతరావు, ప్రముఖ వైద్యులు కుందా శ్రీకర్, డాక్టర్ సురేఖ, డాక్టర్ దిలీప్ ప్రసంగించారు. మొదటి బహుమతిగా వినాయకుని వెండి విగ్రహాన్ని అఖిలేశ్వర్, ద్వితీయ బహుమతిగా వినాయక విగ్రహాన్ని శ్యామ్ అర్జున్‌కు అందజేశారు. 60 మందికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

ఎస్ఆర్ఆర్‌లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో శనివారం రసాయన శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఓజోన్ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్ ద్వారా ఓజోన్ పొర గురించి వివరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, రసాయన శాస్త్ర విభాగం అధిపతి శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేరింత.. తుళ్లింత

యువ ఫేషియల్ సర్జన్ల సందడి



నృత్యాలు చేస్తున్న యువ ఫేషియల్ సర్జన్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ, కత్తెర్లు చేతపట్టి శస్త్రచికిత్సలు నిర్వహించే మాక్సిల్లో ఫేషియల్ యువ సర్జన్లు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అసోసియేషన్ ఆఫ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చాప్టర్ 15వ సమావేశాలు శుక్ర, శనివారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో భాగంగా లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యువ వైద్యులు నృత్యాలు చేసి సందడి చేశారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగిన కార్యక్రమంలో 200ల మందికిపైగా మాక్సిల్లో ఫేషియల్ సర్జన్లు పాల్గొన్నారు.

ముగిసిన సదస్సు

రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సదస్సును డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.బాబ్జి ప్రారంభించగా, ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ గుణశీలన్ రాజన్ పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ ఎన్.కోటేశ్వరరావు, డాక్టర్ మెహబూబ్ షేక్, డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి ఆవిష్కరించారు. ఆధునిక ముఖ, దవడ శస్త్ర చికిత్సలపై విశ్లేషణలు, చర్చా కార్యక్రమాలు జరిగాయి.

రైల్వే క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆకస్మిక తనిఖీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ఆధ్వర్యంలో వాణిజ్య విభాగం అధికారులు విజయవాడ స్టేషన్‌లోని అన్ని క్యాటరింగ్ స్టాల్స్‌ను శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతులు లేని 26 మంది విక్రేతలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.59,800 జరిమనా విధించారు. జరిమానా చెల్లించని ముగ్గురు విక్రేతలను ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు. రైల్వే స్టేషన్‌లో అధిక ధరలు వసూలు చేయకుండా నిర్దేశించిన పరిమితులకు అనుగుణంగా విక్రయాలు సాగించాలి, ముఖ్యంగా రద్దీ సమయంలో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్లాట్‌ఫామ్‌లపై ఆక్రమణలు ఆపాలని సీనియర్ డీసీఎం రాంబాబు స్టాల్స్ నిర్వాహకులు, వెండర్స్‌కు సూచించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శర్వాణి లేబోరేటరీ అధినేత, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఆధ్వర్యంలో శనివారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 500 మంది రోగులు ఈ శిబిరంలో ఈసీజీ, ఎకో, గుండె స్కానింగ్, మ్యామోగ్రఫీ, స్త్రీల సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, ఎముకల తదితర సమస్యలపై డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేటర్ శర్వాణిమూర్తి ప్రతి సంవత్సరం తన సొంత నిధులతో ఉచితంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వేలాదిమంది రోగులకు సేవ చేయడం అభినందనీయమని ప్రశంసించారు. డాక్టర్లు కుందా శ్రీధర్, ఎంవి సాయిరామ్, అనీల పనుమర్తి, గుడిపాటి ప్రదీప్, వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరుగుతుందని శబరిమల అయ్యప్ప సేవా సమాజం కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్ తెలిపారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం, శ్రీ గణేష్ ఉత్సవ సమితి విజయవాడ మహానగర్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ చేస్తామన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు కేఎల్‌రావు నగర్ ఫైర్ స్టేషన్ వద్ద అవ్వారు బుల్లాబ్బాయి ఆధ్వర్యంలో, నెహ్రూబొమ్మ సెంటర్‌లో కిరణ్ స్వామి వారి ఆధ్వర్యంలో, బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కాలేజీ వద్ద సంకా వాసు గురుస్వామి వారి ఆధ్వర్యంలో, మధురానగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద నారాయణ స్వామి వారి ఆధ్వర్యంలో, గాంధీనగర్ పోస్టాఫీసు వద్ద, కృష్ణలంక సత్యం గారి హోటల్ వద్ద మాచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, భవానీపురం స్వాతి రోడ్డులో ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో, తాడేపల్లిలోని కుంచనపల్లిలో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ జరుగుతుందన్నారు. విగ్రహాల పంపిణీలో భక్తులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పరిశుద్ధ సిలువ దేవాలయ మహోత్సవాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ సెయింట్ అన్స్ స్కూల్ సమీపంలోని పరిశుద్ధ సిలువ దేవాలయ మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో రెండో రోజైన శనివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రెవ.ఫాదర్ జి.జోజి ఆధ్వర్యంలో దివ్యబలిపూజను నిర్వహించారు. సంఘ పెద్దలు, క్రైస్తవులు హాజరయ్యారు. నేటితో ఈ ఉత్సవాలు ముగుస్తాయని, క్రైస్తవ విశ్వాసులంతా ఈ వేడుకల్లో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

నిరు పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ


అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలు, అభాగ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ 58వ డివిజన్ నందమూరినగర్‌కు చెందిన చుండూరు వెంకటేశ్వరరావు(44) ఇటీవల రామవరప్పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యుల దయనీయస్థితిని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5 లక్షలను మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

పురోహితుల భవన నిర్మాణానికి రూ.72 లక్షల నిధులు మంజూరు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పురోహితులు, అర్చకుల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సత్యనారాయణపురంలో పురోహిత భవన్ నిర్మాణానికి రూ.72 లక్షల కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు విడుదల చేస్తూ దేవదాయ శాఖ పాలనాపరమైన అనుమతి నిచ్చినట్లు శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక వసతులతో విశ్రాంత భవనం, మెరుగైన సౌకర్యాలతో ఈ భవన నిర్మాణం చేపడతామన్నారు.

నియోజకవర్గంలోని మూడు ప్రసిద్ధ పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1.83 కోట్ల నిధులు విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు. అర్చకుల సంక్షేమం, వారి ఆర్థిక అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు.

చేతివృత్తుల పరిరక్షణకే 'పీఎం విశ్వకర్మ యోజన'



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు మూలాధారమైన చేతి వృత్తులను కాపాడాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ పీఎం విశ్వకర్మ యోజన ప్రవేశపెడుతున్నారని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ రూపొందించిన థ్యాంక్యూ పీఎం మోడీ సార్ వాల్ పోస్టర్‌ను శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జీవీఎల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తులను పరిరక్షించేందుకు సరికొత్త పథకాన్ని రూపొందించిందన్నారు. ఈ పథకం ద్వారా చేతి వృత్తుల వారికి తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించి వారిని ప్రోత్సహిస్తోందన్నారు. బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ మాట్లాడుతూ.. చేతి వృత్తుల వారికి ప్రభుత్వం 5 రోజుల నైపుణ్య శిక్షణను ఇస్తుందన్నారు. ఏపీ బీజేపీ ఆర్టిజన్ విభాగం కన్వీనర్ బంగారు బాబు, ఏపీ విశ్వకర్మ యోజన కన్వీనర్ కర్రి రాఘవ, సెంట్రల్ గవర్నమెంట్ ఓబీసీ ఎంప్లాయీస్ యూనియన్ లీడర్ పితాని హనీష్ చంద్, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి జె.టి.మల్లికార్జునరావు, అచ్చి చినబాబు, రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు పట్నాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.